# అభాగ్య జీవులు

శ్రీ కిళాంబి కృష్ణమాచార్య

అప్పటి కప్పుడే తెలతెలవారుతోంది. సృష్టిఅంతా సూర్య భగవానునితో మేల్కొంటోంది. వృక్షాగ్రాలలోంచి పక్షిజాతులన్నీ నిద్రలేచి బాలభానుని వేనోళ్ళస్తుతిస్తున్నాయి. పాటకవర్గమంతా ఆ దుర్దాగాలేచి తమ తమ నియమిత స్థలాలకు వేగంగానడిచిపోతున్నారు.

ఆ పూరికి ఈశాన్యమూలగా ఒక బ్రహ్మాండమైన రావిచెట్టువుంది. ఆ చెట్టుక్రింద ఎన్ని బీదసంసారాలు కాపురమున్నాయో లెక్కలేదు. పగలల్లా ఏదో అడుక్కొసి సంపాదించిన దాంతో మెల్లిగా కాలక్షేపం చేస్తూ చీకటి పడంగానే ఆచెట్టుక్రింద చేరేవాళ్లు. ఆ చెట్టుక్రిందనే ఒక మూల తాత తన చిన్నమనుమడితో నివాసం ఏర్పరచుకున్నాడు. ఆ తాత రెండుకళ్లూ లేనికబోది. అతడు ఎంతకాలంనుంచి ఆ చెట్టుక్రింద కాపురంచేస్తున్నాడో ఎవరికీ తెలిసినట్లులేదు. ప్రతివాళ్లూ ఆ తాతనుచూచి పంచప్రాణాలు విడిచేవారు. రాత్రిళ్లు చాలా పొద్దుబోయేదాకా ఏ అధ్యాత్మరామాయణ కీర్తనలో శ్రావ్యంగాపాడి, వినేవాళ్ళ కష్టాల్ని మరిపించేట్లు చేసేవాడు. ఆ చెట్టుక్రింద నివాసమేర్పరుచుకున్న వాళ్ళలో ఎవరికి కష్టం వచ్చినా, తాత సలహాలేనిదే ఏపనీ జరిగేదిగాదు. అతడంటే అందరికీ అధికమైన భక్తి గౌరవమూను.

చూడటానికి తాత ఎనుబది ఏండ్లవాని మాదిరిగావుంటాడు. పచ్చటి శరీరచ్ఛాయ, నిడుపైన తెల్లటి గడ్డమును చూడంగానే అతనూ ఒకప్పుడు బాగాబ్రతికివుంటాడని వూహించవచ్చును. అతడు ఎవర్నీ ఎన్నడూ దూషించి ఎరుగడు. పిల్లలంతా చుట్టూ మూగి 'తాత తాత' ని గడ్డంపట్టుకొని ఆడుకొనేవాళ్లు. వాళ్లందర్నీ ప్రేమతో దగ్గరకు తీసికొని చక్కటి కథలుచెప్పేవాడు. అందువల్ల తాత కాసేపు వూళ్లోకి పోతే పిల్లలంతా తహతహలాడిపోయేవాళ్లు.

* * *

తాతకు తన మనుమడంటే అపారమైన ప్రేమ. రోజూ తాతను తీసికొని వూళ్లోకి అడుక్కోవటానికి తీసికెళ్లేవాడు ఆ చిన్నమనుమడు. తాతయొక్క శ్రావ్యమైన కంఠస్వరానికి అంతా తన్మయులయ్యేవారు. పొద్దున్నంతా ఇల్లిల్లూ తిరిగి అడుక్కొని అపరాహ్ణమువేళ చెట్టు నీడ చేరేవాళ్లు తాతా మనుమడూ.

"ఇవాళ ఒక్క పిడికెడు బియ్యంగూడ దొరుకలేదుతాతా!" అన్నాడు మనుమడు చాల నిరుత్సాహంగా. తాత ఒక్క దీర్ఘనిట్టూర్పు మాత్రం విడిచాడు. ఎండ చండప్రచండంగా కాస్తోంది. వేడిగాడ్పులు భయంకరంగా వీస్తున్నాయి. కాని ఆ యిద్దరూ ఎంతదూరం తిరిగినా ఏమీ దొరకలేదు ఆరోజు.

"చాల ఆకలేస్తోందితాతా" అన్నాడు మనుమడు దీనంగా, తాత కన్నులవెంట అశ్రుధారలు కారసాగాయి. మనుమడిదీనావస్థకు చాలబాధపొందాడు. ఆకలిబాధకు మనుమడి కాళ్లు తడబడసాగాయి. తాత దుఃఖము మరీ మిక్కుటమయింది. పిల్లవాడికి తెలియకుండా దుఃఖాన్ని దిగమ్రింగుకోవటానికి వ్యర్థప్రయత్నంచేసాడు. మరికొన్ని యిళ్లు తిరిగారు. ఎక్కడికి వెళ్లినా ఆరోజు ప్రొద్దుఎదురయింది. పిల్లవాని హృదయంలో ఒక్కమాటు ఆశరేకెత్తింది. దూరంగా జాతికుక్కపిల్లకు రొట్టె ముక్కలు విసిరేస్తున్నాడు ఒక గొప్పయింటి ఆసామి: ఆ నిమిషంలో పిల్లవానికి

ఆ కుక్కపిల్లమీద కొంచెం ఈర్ష్య కలిగింది. తనకే ఆరొట్టె ముక్కలు లభించి నట్లయితే తన ఆకలిచిచ్చు చల్లారేది గదా అని చాల విచారించాడు. తాత ఈ విషయం గ్రహించాడు. తన మనమణ్ణే ముంద లించాడు ఏదో ఆలోచనలో మునిగిపోయి.

"తాతా, త్వరగా నడూ"అని కుర్రాడు అనగానే తాత త్వరితగతి సాగించాడు. అప్పటి కప్పుడే అపరాహ్ణము కావస్తోంది. పిల్లవాడు ఆకలి బాధకు ఓర్చుకోలేక గిలగిల కొట్టుకొన్నాడు. ఒక యింటిముందు నిలిచారు ఆ యిద్దరూను. ఈ యింట్లో మేళాలు బాగా మోగుతున్నాయి. ముందరంతా పందిళ్ళతోటి, రంగు రంగులతోరణాల తోటి అలంకరించివుంది ఆ యిల్లు. అంతా హడావిడిగా అటూ ఇటూ పరుగెడుతున్నారు. ఇంటి ప్రక్కన ముత్యాలహారము మాదిరి మోటార్లు వరుసగా నిల్చివున్నాయి. చల్లగా వుందని ఒకచోటకూలబడ్డారు. ఇంతట్లోకే:అంతా భోజనాలు ముగించి చేతులు కడుకోక్కవటానికి వాకిట్లోకివచ్చారు. పిల్లవాడు సొమ్మసిలి తాతవళ్ళో పడుకున్నాడు. పెళ్లి ఇంట్లోంచి ఒకరిద్దరు పూర్వాసువాసినులు ఆకులు పారవేయటానికి బయటికివచ్చారు. పిల్లవాడు ఆశతో తలపైకెత్తి వాటివంక చూసాడు. ఆకులకోసము నాలుగైదు కుక్కలు వాటివైపు పరుగెత్తాయి. పిల్లవాడు తాత ఒళ్ళోంచి లేచి వాటివైపు పరుగెత్తాడు. ఆ కుక్కల్ని అదిలించి ఎంగిలాకులన్నీ పోగుచేయటానికి పూనుకున్నాడు తాతవద్దని ఎంత వారించినా వినకుండా, పిల్లవాని ప్రాణాలు నిలబెట్టటానికి తాత తటస్థంగా వూరుకున్నాడు. ఆకుల్లో మిగిలిపోయిన పదార్థాలన్నింటిని ప్రోగుచేస్తున్నాడు ఆ పిల్లవాడు, నాలుగైదు కుక్కలు పిల్లవానిమీద కలియబడి పిల్లవాని చేతుల్లోనున్న పదార్థాల్ని భూదేవి పాలుచేసేసాయి. పిల్లవాడు నిస్పృహచెందాడు. పిడికెడు మెతుకులకొరకు నీచజాతి జంతువులతో తన మనుమడు పోరాడవలసి వచ్చినందుకు తాత చాల దుఃఖించాడు. అక్కడచేరిన కుక్కలన్నీ తమ సొత్తును అపహరింప బూనిన దొంగపిల్లవానివైపు చురచుర చూడసాగాయి.

*  *  *

కాస్సేపటికల్లా గృహోన్ముఖులయ్యారు తాతమనుమడూను. సాయంకాలానికల్లా నిరాశతో తమ చెట్టు చేరగలిగారు. మనుమణ్ణి ఒళ్ళో పడుకోబెట్టుకొని నిద్రబుచ్చాడు. ఆ గ్రుడ్డివానికి తన మనుమడే తన సర్వస్వమూ. మశూచికం వచ్చి తన భార్య, కోడలు, కొడుకూ మరణించినప్పటినుంచీ తన మనుమణ్ణి కంటికి రెప్పమాదిరి కాపాడుతున్నాడు. అందువల్లనే తాతకు మనుమడన్న జీవనజ్యోతి.

అమాయకంగా నిద్రపోతున్న మనుమడి చెక్కిలి ముద్దాడాడు. పిల్లవాని ముంగురులు నిమురుతూన్నపుడు అప్రయత్నంగా తాత నేత్రముల వెంట అశ్రుధారలు జొటజొట రాలసాగాయి. లోకంలో జరిగే అన్యాయాలను తలుచుకున్నపుడు తాత హృదయం కుమిలిపోయింది. తుదకు హీనజాతి కుక్కలకుగూడ చూపే ఆదరణ పసిపిల్లవాని మీద చూపలేని అంధలోకాన్ని గురించి విచారింపసాగాడు. ధనం అంతా ఏ క్రొద్దిమంది చేతులయందో యిమిడివుంది; తెక్కన కోటానుకోట్లకు పిడికెడు మెతుకులకుకూడ కరువైసందుకు వాపోసాగాడు కాని ఒక్క వ్యక్తినిగూడ తన జీవితంలో ద్వేషించివెరుగడు. అతడొక ప్రేమస్వరూపి. నవనీతసదృశమగు అతని హృదయమొక అనంతమగు ప్రేమసాగరము. అందు ద్వేషము నకుగానికల్మషమునకు గాని ఏమాత్రం తావులేదు.

*  *  *

రాత్రి బాగా ప్రొద్దుపోయింది. దూరంగా నక్కలు తమకూతలచేత

అగాధనిశ్శబ్దాన్ని బేధిస్తున్నాయి: తాత కన్ను మూయకుండా దైవ ప్రార్థన చేసుకొంటూ కాలము గడుపసాగాడు. పిల్లవాడు మూసిన కన్ను తెరువకుండా ఒడలెరుగకుండా పడివున్నాడు. ఎక్కడినుంచో కారు మేఘాలు గగనవీధిని త్వరత్వరగా క్రమ్ముకున్నాయి. గాలి రివ్వున వీస్తోంది. అంధకారము నల్దెశల నావరించి ప్రళయ తాండవము సల్పుతోంది. చినుకులు టపటపమని పడుతున్నాయి. వాయువేగానికి వృక్ష శాఖలు పెళపెళమని విరిగి పడుతున్నాయి. ఆ వృక్షము క్రిందగల భిక్షుక వర్గమంతా మూట ముల్లె సర్దుకొని తమ సంసారాలను మరో గుబురుగావున్న చెట్టుక్రిందకు చేరుస్తున్నారు. ఆ సందడిలో తాత విషయం ఎవ్వరికీ జ్ఞప్తిలేదు వర్షము క్షోణీపాతంగా కురుస్తోంది. తాత తనమనుమడికి తన చినుగుల చొక్కాతో కప్పి యింకోచోటికి పోవటానికి అశక్తుడై యింకా అక్కడే కూర్చున్నాడు. కొంత సేపటికల్లా వర్షము వెలిసింది. దానితో తాత మనసుకూడ కొంత వికసించింది. వర్షపు నీరు కాల్వలగా ప్రవహింపసాగాయి. మనుమడు నీరసంతో 'తాతా' అని, హీనస్వరంతో పిల్చాడు. తాత ఒక్కమాటు వులికిపడి మనుమణ్ణి తన నిర్మల హృదయానికి హత్తుకున్నాడు పిల్లవాని హీనదశచూచి తాత హృదయం కంపింపసాగింది. కాని ఏమిచేయటానికి అంధత్వము అతన్ని అశక్తుణ్ణిచేసింది. పిల్లవాడు తెల్లవార్లూ కలవరిస్తూనే వున్నాడు. తాత జోకొట్టి నిద్రబుచ్చుతున్నాడు.

తెలతెలవార జొచ్చింది. తాత ఒక్క దీర్ఘనిట్టూర్పు విడిచాడు. తన కష్టాలు గట్టెక్కునని ఆశచెందాడు: పిల్లవాడు ఒత్తిగిలుతున్నట్లు గ్రహించాడు. సంతోషంతో తాత హృదయం వుప్పొంగిపోయింది. కాసేపు నిశ్శబ్దం. "తాతా" అన్న శబ్దము ఆ ముదుసలి కర్ణకుహారాలలో వినిపించింది. కాని ఆనాదము అసహజమైనదని గ్రహించగలిగాడు పిల్లవానిని తట్టిచూచాడు. ఏమాత్రమూ కదలలేదు. తాత హృదయం బ్రద్దలయింది. అతని హృదయ సీమను అంధకారము ఆవరించింది. మనుమడి మీద వ్రాలిపోయాడు. రెండు జీవాలు పైకెగిరిపోయినాయి. ప్రకృతిఅభాగ్య జీవులమీద పగసాధించింది. బాలభానుడు ఆ విషాదగాథతో తన కేమీ సంబంధములేనట్లు వుదయిస్తున్నాడు.

## హస్తరేఖాశాస్త్రము.



విశదముగా తెలియగల 300చిత్రములతోగూడి స్త్రీలు బాలురు సైతము చదువుట కనుకూలించు తేట తెల్లమగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంధముచేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము లౌకిక సుఖము వ్యాజ్యము, శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొనవచ్చును. ఇంక, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంధము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట కెంతయు సందియంబు లేదు. దీని వెల 2—0—0

సౌకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.